# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 80.66 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**

2. **క్షయ నియంత్రణ చర్యల్లో భాగంగా రేపటి నుంచి బీసీజీ టీకాను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది.**

3. **రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కారణంగా గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.**

4. **బాపట్ల జిల్లా చిలకలూరిపేట ఈవూరివారి పాలెం డొంక సమీపంలో గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 6 మృతి చెందారు.**

5. **అపర భగీరధుడుగా పేరుగాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఈరోజు.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోని 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 80.66 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్‌లో భాగంగా రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లో అత్యధికంగా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో 87.06 శాతం పోలింగ్ నమోదు అవ్వగా, అత్యల్పంగా విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో 71.11 శాతం పోలింగ్ నమోదైందని తెలిపింది. అలాగే 175 శాసనసభ స్థానాల్లో ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 90.91శాతం పోలింగ్ నమోదైందని, అత్యల్పంగా తిరుపతి నియోజకవర్గంలో 63.32 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

--------------------------

క్షయ నియంత్రణ చర్యల్లో భాగంగా రేపటి నుంచి బీసీజీ టీకాను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్ తెలిపారు. తొలి విడతగా అల్లూరి సీతారామరాజు, విశాఖ, విజయనగరం, కృష్ణా, గుంటూరు. పల్నాడు. అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, వైఎస్సార్, శ్రీసత్యసాయి జిల్లాల్లో టీకా పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక సమన్వయ అధికారులను

నియమించామని  తెలిపారు. ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ వ్యాధి తగ్గిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్థులు, ధూమపానం అలవాటు ఉన్నవారు, 60 ఏళ్లు పైబడిన వారికి ఈ టీకాను అందజేస్తామని వెల్లడించారు.

---------------------------

రైల్వే లైన్ డబ్లింగ్ పనులు, సాంకేతిక కారణాలతో  గుంటూరు డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేసినట్లు  రైల్వే అధికారులు తెలిపారు. గుంటూరు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన  రైళ్లను రేపటి  నుంచి జూన్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు చీఫ్ ప్యాసింజర్ ట్రాఫికింగ్ మేనేజర్ ఏ.సురేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, గుంతకల్లు మధ్య నడిచే రైళ్లలో గుంటూరు – కాచిగూడ, కాచిగూడ – గుంటూరు, హుబ్లీ – విజయవాడ, విజయవాడ – హుబ్లీ  రైళ్లు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వివరించారు.

---------------------------

బాపట్ల జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరి వారి పాలెం డొంక సమీపంలో గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 6గురు మృతి చెందారు. హైదరాబాదుకు వెళ్తున్న  ప్రైవేట్ ట్రావెల్ బస్సును టిప్పర్  ఢీ కొనడంతో మంటలు వ్యాపించి రెండు వాహనాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఆ సమయంలో  బస్సులో మొత్తం 42 మంది ఉన్నట్లు క్షతగాత్రులు తెలిపారు. వీరిలో టిప్పర్ డ్రైవర్, ట్రావెల్ బస్ డ్రైవర్ తోపాటు  బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. వీరంతా బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయిపాలెం వాసులుగా చెబుతున్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకొని హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు.

---------------------------

అపర భగీరథుడుగా పేరుగాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఈరోజు. ఉభయ గోదావరి రైతన్నలు నిత్యం తలచుకునే ఆర్థర్ కాటన్ 1803 మే 15వ తేదీన ఇంగ్లండ్‌లో జన్మించారు. గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజి నిర్మాణానికి ఆద్యుడయ్యారు. 1852లో గోదావరి నదిపై ఆయన నిర్మించిన ఆనకట్ట ఉభయ గోదావరి జిల్లాల్లోని రైతుల, ప్రజల జీవన స్థితిగతులను మార్చేసింది. తమ పాలిట దు:ఖదాయనిగా  ఉన్న గోదావరిని.. వరప్రదాయనిగా మార్చడంలో ఆర్థర్ కాటన్ పాత్ర కీలకం. ఇప్పటికీ ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఆయనను దైవంగా భావిస్తుంటారు. ఈరోజు ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా గోదావరి డెల్టా ప్రజలు… నీటి పారుదల రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

అఖండ గోదావరికి ఆనకట్టని నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను పాడిపంటలుకు నిలయాలుగా మార్చిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఈరోజు రాజమహేంద్రవరంలోని  ధవళేశ్వరం బ్యారేజి వద్ద సర్ ఆర్థర్ కాటన్  విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె  మాట్లాడుతూ, గోదావరి డెల్టా వ్యవస్థకు కాలువ ఆయకట్టు నిర్మించి సర్ ఆర్థర్ కాటన్ ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు.

---------------------------

ఎన్నికల పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు కారణంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్  తెలిపారు. జిల్లాలోని  నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, పెదకూరపాడు.

గురజాల, మాచర్ల శాసనసభ నియోజకవర్గాల్లో తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలుపుతూ.....

.....వాయిస్.... 30 సెకన్లు.....

---

రైల్వే స్టేషన్‌లో  స్టాల్స్ నిర్వాహకులు నాణ్యత, పరిమాణం, నిర్దేశించిన ధరలకు మాత్రమే వస్తువులను విక్రయించాలని విజయవాడ డివిజనల్ కమర్షియల్ మేనేజర్- డీసీఎం అలీఖాన్ విక్రయదారులను ఆదేశించారు. నిన్న విజయవాడ రైల్వేస్టేషన్‌లో క్యాటరింగ్, స్టాల్స్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ, విజయవాడ డివిజనల్ రైల్వే స్టేషన్లలోని విక్రయదారులు రైల్వే పరిపాలనశాఖ సూచనల మేరకు నాణ్యత, పరిమాణం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అధిక ధర, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడంపై వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా ఆయా స్టాల్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులకు వివాద పరిష్కార ప్రత్యామ్నాయం, మధ్యవర్తిత్వం అంశంపై నిన్న అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్  మాట్లాడుతూ న్యాయస్థానాల్లో  కేసులు పరిష్కారానికి ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రాజీ చేయటానికి,  మధ్యవర్తిత్వం ద్వారా న్యాయం చేసేందుకు న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉమ్మడిగా కృషి చేయాలని అన్నారు. దీనిపైన పూర్తి అవగాహన కల్పించడం కోసం ఈ సదస్సును నిర్వహించామని తెలిపారు.

---

ప్రకాశం జిల్లాలోని  ఒంగోలు పార్లమెంటు, 8 శాసనసభ నియోజకవర్గాలలో పోలింగ్ జరిగిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కె.మెహతా, జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లతో కలిసి కలెక్టర్ ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను  పూర్తిచేసి ఒంగోలులోని రైజ్ కళాశాలలో  ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరచడం జరిగిందన్నారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను సీల్ వేయడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడు అంచల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్ర బలగాలు 24 గంటల పాటు భద్రత కల్పిస్తాయని పేర్కొన్నారు.

---

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 30 సెకన్లు.....**

---

ఇండియన్ ప్రీమియర్ లీగ్– ఐపీఎల్‌లో భాగంగా ఈరోజు సాయంత్రం గౌహతిలోని బర్సపరా క్రికెట్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు, పంజాబ్ కింగ్స్ జట్టుతో తలపడుతుంది. కాగా నిన్న ఢిల్లీ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు, లక్నో సూపర్ జేయింట్స్‌ని 19 పరుగుల తేడాతో ఓడించింది.

======================